

ఫలితాలు ప్రకటిస్తున్న డీవీఈఓ, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, ఇతర అధికారులు →

- ఇంటర్ ఫలితాలలో భిన్నత్వం
- ద్వితీయ సంవత్సరం 19,541కి 15,632 మంది పాస్
- మొదటి సంవత్సరం 22,824కి 14,439 మంది పాస్
- రాష్ట్రంలో జిల్లాకు దక్కిన 13వ, 17వ స్థానాలు
- నేటి నుంచి 22వ వరకూ రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ గడువు
- ఈ నెల 15 నుంచి సప్లీ ఫీజు చెల్లింపు అవకాశం
- మే 12 నుంచి 20 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు



ర్యాంకు తగ్గి.. ఉత్తీర్ణత పెరిగి..!

అనంతపురం విద్య, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 42,365 మంది విద్యార్థులకుగానూ 30,071 మంది ఉత్తీర్ణత సాధించారు. 12,294 మంది ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం 19,541 మందికిగానూ 15,632 మంది, ప్రథమ సంవత్సరం 22,824 మందికిగానూ 14,439 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం 80 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణతతో 17వ స్థానంలో నిలిచింది.

గత ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,653 మందికిగానూ 12,210 మంది పాసయ్యారు. 78 శాతంతో జిల్లా 10వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం 21,826 మందికిగానూ 13,115 మంది పాసయ్యారు. 60 శాతంతో 16వ స్థానం దక్కింది. గత ఏడాది ఫలితాలతో పోలిస్తే జిల్లా ర్యాంకు తగ్గినా.. ఉత్తీర్ణత శాతం పెరిగింది.

రీ కౌంటింగ్.. రీ వెరిఫికేషన్..

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆదివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. జవాబు పత్రాల రీ వెరిఫికేషన్ కోసం రూ.1300, రీ కౌంటింగ్ కోసం రూ.260 చెల్లించాల్సి ఉంటుంది. సప్లిమెంటరీ పరీక్షలు ఫీజు జనరల్, ఒకేషనల్ థియరీ సబ్జెక్టులకు రూ.600, ప్రాక్టికల్స్‌కు (జనరల్ కోర్సులు) రూ.275, జనరల్ బ్రిడ్జి కోర్సులకు రూ.165, బ్రిడ్జి కోర్సులు ప్రాక్టికల్స్ కోసం రూ.275 చెల్లించాల్సి ఉంటుంది.

15 నుంచి సప్లీ ఫీజు

సప్లిమెటరీ పరీక్షలకు ఈ నెల 15వ తేదీ నుంచి ఫీజు చెల్లించవచ్చు. వచ్చే నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ సప్లిమెటరీ పరీక్షలు నిర్వహిస్తారు. నిర్ణీత తేదీల్లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, సెకెండ్ ఇయర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఎంపీ అంబికా అభినందనలు

అనంతపురం అర్బన్: ఇంటర్‌లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపించారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అభినందించారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి మార్కులు సాధించడం, మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించడం గర్వకారణమని ఆయన అన్నారు. ఇది జిల్లాలో విద్యా ప్రగతికి నిదర్శనమని అన్నారు.



- గుంతకల్లు పట్టణానికి చెందిన శస్త్ర కళాశాల విద్యార్థిని ఎస్.మహమ్మద్ షబనాజ్ బైపీసీలో 993 మార్కులు సాధించింది. షబనాజ్ తల్లి షహినా బేగం గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు జడ్పీ హైస్కూలులో హిందీ టీచరుగా పనిచేస్తున్నారు. తండ్రి ఇమ్రాన్ బాషా ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడు. తమ కూతురుని వైద్యురాలిని చెయ్యడమే లక్ష్యమని వారు తెలిపారు.



- తాడిపత్రి పట్టణంలోని సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థిని మెహఖ్ సుల్తానా ఎంపీసీలో 992 మార్కులు సాధించించింది. మెహఖ్ తండ్రి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కాగా తల్లి కలీమున్నీసా గృహిణి. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేస్తానని మెహఖ్ తెలిపారు.

పన్నెండేళ్లలో ఇదే ఎక్కువ

జిల్లాలో గత పన్నెండేళ్లుగా లేని విధంగా ఇంటర్ ఫలితాలు వచ్చాయి. ఇవి అనూహ్యమైన ఫలితాలని చెప్పవచ్చు 2014 నుంచి ఇప్పటి వరకూ ఈ స్థాయి ఉత్తీర్ణత నమోదు కాలేదు. ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులు 63 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 80 శాతం మంది పాసయ్యారు.

ఏడాది	మొదటి సంవత్సరం	రెండో సంవత్సరం
2014	49శాతం	65శాతం
2015	53శాతం	66శాతం
2016	57శాతం	69శాతం
2017	54శాతం	70శాతం
2018	54శాతం	68శాతం
2019	50శాతం	68శాతం
2020	47శాతం	54శాతం
2021	100శాతం	100శాతం (కొవిడ్ ఏడాది)
2022	46శాతం	55శాతం
2023	57శాతం	67శాతం
2024	60శాతం	78శాతం
2025(ఈ ఏడాది)	63శాతం	80శాతం



పూజారి అర్చన



గోపిచంద్



షమీర్‌నాజ్



అయేషా



షేక్ తస్కీన్

పేదింటి సెలబ్రిటీలు

ప్రైవేటు, కార్పొరేటు కాలేజీల తరహాలో లక్షలాది రూపాయల ఫీజులు, ఖర్చులు వెచ్చించకపోయినా.. రకరకాల కోర్సుల పేరట టన్నుల కొద్దీ పుస్తకాలు కొనకపోయినా.. ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు సత్తా చాటుకున్నారు. పేదింటి విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో మెరిశారు.

- అనంతపురం కేఎస్ఆర్ కాలేజీ ఎంపీసీ విద్యార్థిని షేక్ తస్కీన్ 954 మార్కులు, హుమేరా సుల్తానా 953 మార్కులు సాధించారు. సీఈసీ విద్యార్థినులు అరుణ, సఫియా 976 మార్కులు సాధించారు.
- పామిడి జూనియర్ కాలేజీ బైపీసీ విద్యార్థిని షమీర్ నాజ్ 980 మార్కులు సాధించింది. రాయదుర్గం జూనియర్ కాలేజ్‌లో సెకెండ్ ఇయర్ ఎంఎల్‌టీ విద్యార్థిని ఐశ్వర్య 958 మార్కులు సాధించింది. కుందుర్పి జూనియర్ కాలేజీలో సీఈసీ విద్యార్థిని సౌమ్య 920 మార్కులు సాధించింది.

మొదటి సంవత్సరం మెరికలు.

కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎంపీసీ విద్యార్థిని పూజారి అర్చన 470 మార్కులకు 459 మార్కులు సాధించింది. గోపిచంద్ 451 మార్కులు సాధించాడు. అనంతపురంలోని కేఎస్ఆర్ కాలేజ్ ఏ అండ్ టీ విద్యార్థిని ఇందు 500 మార్కులకు 489 మార్కులు సాధించింది. హెచ్‌సీఎంఎల్ కోర్సు(ఉర్దూ) చేస్తున్న నర్గీస్ 500 మార్కులకు 455 మార్కులు సాధించింది. సీఎస్ఈలో స్నేహ 500 మార్కులకు 489 మార్కులు సాధించింది. తాడిపత్రి జూనియర్ కాలేజీ విద్యార్థి వెంకట నరేంద్ర బైపీసీలో 440కి 429 మార్కులు సాధించాడు.

మెరుగైన మార్కులు

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం 35శాతం, ద్వితీయ సంవత్సరం 67 శాతం మంది పాసయ్యారు. ఏపీ మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం 62శాతం, రెండో సంవత్సరంలో 73శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని అంజుమ్ 439 మార్కులు, బైపీసీలో కుమ్మర శ్రావణి 418 మార్కులు, ఎంఈసీలో శ్రీలేఖ 398 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్ శిరీష 890 మార్కులు, బైపీసీలో గ్లోరి 869 మార్కులు, సీఈసీలో నవని 816 మార్కులు సాధించారు. కేజీబీవీలో ప్రథమ సంవత్సరం 48శాతం, ద్వితీయ సంవత్సరం 85శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎంఈసీ మొదటి సంవత్సరం విద్యార్థిని నందిని 408 మార్కులు, రుచిత 397 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంఈసీలో ఎం సౌమ్య 856 మార్కులు, ఆర్ శ్రావణి 842 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుభద్రమ్మ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌభాగ్య లక్ష్మి విద్యార్థులను అభినందించారు.

కొన్నింట అద్భుతం

ఐదు వెల్ఫేర్ కాలేజీలు, ఒక కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత మొదటి సంవత్సరం కణేకల్లు వెల్ఫేర్, కూడేరు కేజీబీవీలో కూడా..

(9లో...)

టీటీడీ గోశాలపై అసత్య ఆరోపణలు దుర్మార్గం

- భూమన కరుణాకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మండిపడ్డారు. టీడీపీ స్థానిక జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో శ్రీవారి సంపదను కొల్లగొట్టారన్నారు. రోజూ వందలాది టిక్కెట్లను అమ్ముకుని, దోచుకోవడంతోపాటు ఎర్రచందం స్మగ్లింగ్ చేసిన భూమన కరుణాకర్ రెడ్డి ఇప్పుడు సనాతన ధర్మంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో చేసిన అక్రమాలు, అరాచకాలు బయటికొస్తున్న తరుణంలో టీటీడీ గోశాలలో 100 ఆవులు మృతి చెందాయని అసత్య ప్రచారం చేసి, డైవర్షన్ రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. గోశాలపై తప్పుడు ప్రచారం చేసిన భూమన కరుణాకర్ రెడ్డిపై పోలీసు యంత్రాంగం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మాట్లాడుతూ... టీటీడీ గోశాలలో ఆవులు చనిపోయాయని దుష్ప్రచారం చేయడం అవివేకమన్నారు. భూమన కుమార్తె వివాహం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం చేసిన మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. సాక్షాత్తు 'శ్రీవారి విగ్రహాన్ని నల్లరాయి అనీ, తొలగిస్తే ఏమవుందని మాట్లాడిన భూమనకు హిందూధర్మంపై వ్యాఖ్యానించే అర్హత ఎక్కడ ఉందన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై విచారణ సాగుతున్న తరుణంలో ఎక్కడో బయట చనిపోయిన ఆవుల ఫొటోలను చూపిస్తూ టీటీడీ గోశాలపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. భూమన తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూచి హరి, కురుబ నారాయణస్వామి పాల్గొన్నారు.

13 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా వజ్రకరూరులో 37.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కంబదూరు 26.4, గుంతకల్లు 22.2, బ్రహ్మసముద్రం 17.2, కుందుర్పి 16.6, విడపనకల్లు 10.2, పామిడి, 6.4, గుమ్మఘట్ట 6.2, కళ్యాణదుర్గం 3.4, బెళుగుప్ప, ఆత్మకూరు 3.0, గుత్తి 2.8, శెట్టూరు 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. శనివారం గుంతకల్లులో భారీ వర్షం పడింది. గుత్తి, యాడికి తదితర మండలాల్లో వర్షం పడింది.

రాములోరి సేవలో ముస్లిం కుటుంబం

కల్యాణోత్సవానికి హాజరైన వారికి తాంబూలం పంపిణీ

శింగనమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న హిందూ కుటుంబం తాంబూలం పంపిణీ చేసి, మత సామరస్యాన్ని చాటింది. స్థానిక కల్యాణ మండపంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. వారికి సంప్రదాయం ప్రకారం తాంబూలం ఇవ్వాలి. శింగనమలకు చెందిన డీలర్ మసూద్ వలి కుటుంబ సభ్యులు.. కల్యాణోత్సవానికి వచ్చిన మహిళలకు తాంబూలం పంపిణీ చేశారు. దీనిపై మసూద్ వలి మాట్లాడుతూ.. వారం రోజుల్లో తన కుమార్తె వివాహం ఉందనీ, సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా మహిళలకు తాంబూలం పంపిణీ చేస్తే మంచి జరుగుతుందనే నమ్మకంతోనే ఇలా చేశానన్నారు. మత సామరస్యం చాటిన ఆయనను అందరూ అభినందించారు.



తాంబూలం అందజేస్తున్న ముస్లిం మహిళ

పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం

వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ

కణేకల్లు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాల కారణంగా పంటలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆమె శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. కణేకల్లు మండలంలో దాదాపు 433 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా.. 318 మంది రైతులకు రూ.2.68 కోట్ల నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు.

255 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిని రూ.1.96 కోట్లు, 76 హెక్టార్లలో పత్తి దెబ్బతిని రూ.25 లక్షలు నష్టం వచ్చినట్లు గుర్తించామన్నారు. బొప్పాయి, మామిడి, అరటి ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లిందని రైతులు తమ దృష్టికి తీసుకురాగా.. నివేదికలు సమర్పించాల్సిందిగా హార్టికల్చర్ అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో విత్తనోత్పత్తి క్షేత్రం ఏడీఏ నారాయణనాయక్, ఏఓ శ్రావణ్‌కుమార్, ఏఈఓ మణికంఠ పాల్గొన్నారు.

శంభో.. సంగమేశ్వరా..

- వైభవంగా జోడులింగాల స్వామి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కూడేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన జోడులింగాల సంగమేశ్వర స్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. శివనామస్మరణ చేసుకుంటూ రథాన్ని లాగారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం మడుగుతేరు నిర్వహించారు. భక్తులు ఉపవాసంతో మడుగుతేరు లాగి, మొక్కులు తీర్చుకున్నారు. మడుగుతేరుకు పార్వతీపరమేశ్వరులు బయలుదేరే సమయంలో భక్తులు, యువకుల శివనామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది. ఆలయ ఆవరణలో నవగ్రహ, గణపతి, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి రథం లాగే సమయంలో పండితులు హోమాలు చేశారు. కుమ్మర వారి ఆధ్వర్యంలో పూర్ణాహుతి ఏర్పాటుచేశారు. ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలు తీసుకొచ్చే సమయంలో భక్తులు గుమ్మడికాయలు, టెంకాయలను సమర్పించారు. సాయంత్రం వేలాదిమంది భక్తుల నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. జిల్లాతోపాటు కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.





మడుగు తేరును లాగుతున్న భక్తులు, స్వామివారి ఉత్సవ విగ్రహాలు

కల్యాణ వైభోగమే..!

కమనీయంగా రంగనాథుడి కల్యాణం

తాడిపత్రి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోనలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత ఆలూరు రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రంగనాథస్వామి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఆలూరు గ్రామానికి తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి వీధుల్లో ఊరిగించారు. రథోత్సవం తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు.





కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి రంగనాథస్వామి, రథోత్సవం జరుగుతున్న దృశ్యం





ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ఏటేటా 15శాతం





మున్సిపాల్టీల్లో మళ్లీ పెరిగిన ఆస్తి పన్ను

- ఈనెల ఒకటో తేదీ నుంచే అమలు
- ఐదేళ్లలో రెట్టింపు
- లబోదిబోమంటున్న పట్టణ ప్రజలు

మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను 15శాతం మళ్లీ పెరిగింది. ఈ పెంచిన పన్ను ఈనెల ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లాలోని పట్టణ ప్రజలపై రూ.కోట్లలో పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ప్రతి ఏటా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో పడుతున్న ఆర్థిక భారం మున్సిపాలిటీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. దీనిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. గతంలో మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి విలువ, మున్సిపాలిటీల్లో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణలోకి తీసుకునేవారు. మున్సిపాలిటీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతోపాటు చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ఆస్తి విలువ ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు. దీనికి ఏటా ప్రభుత్వం 15శాతం చొప్పున పెంచేస్తోంది. ఇలా వరుసగా పెరిగిన పన్నుతో ఐదేళ్లకు అది రూ.990కి చేరింది. ఇలా జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

50శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50శాతం వడ్డీరాయితీని ప్రకటించింది. గత ఆర్థికసంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఆ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరునెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీని పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్ను దారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.


ధర్మవరం పట్టణ ముఖచిత్రం

5శాతం రాయితీ

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5శాతం రాయితీ అమలు చేస్తోంది. ఈ నెలాఖరిలోగా చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పన్ను చెల్లిస్తున్నారు.

కొనసాగుతున్న వైసీపీ విధానం

మున్సిపాలిటీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. కానీ అలా జరగలేదు. ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు తేలింది. ప్రతి ఏటా పన్నుల పెంపుతో నాలుగైదేళ్లలోనే పన్నుల భారం రెట్టింపైంది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పరిగి, ఏప్రిల్ 12(ఆంధ్ర జ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయ (కేజీబీవీ)లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శనివారం అదృశ్యమైంది. ఎస్‌ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి మండలం భయన్నపల్లికి చెందిన ఓ విద్యార్థిని పరిగి కేజీబీవీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంటర్ పరీక్షా ఫలితాలు శనివారం వెలువడటంతో విద్యార్థిని ఎకనామిక్స్ సబ్జెక్టు తప్పింది. దీంతో మనస్తాపం చెంది కళాశాలలోని బాత్‌రూం గోడ దూకి వెళ్లిపోయింది. హాస్టల్‌లో విద్యార్థిని కనిపించకపోవడంతో సిబ్బంది పరిసర ప్రాంతాల్లో వెతికారు. కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హాస్టల్ వద్దకు చేరుకుని, ఆరాతీశారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఎస్‌ఓ సువర్ణ భారతి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కమిటీ ఎన్నిక

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, ఉపాధ్యక్షుడు శంకర్, ప్రచార కార్యదర్శి ఓంప్రకాష్ అధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, గౌరవాధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్రావణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తానని ఆయన తెలిపారు.


గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

భవితకు భరోసా

- భవిత కేంద్రాలకు ప్రభుత్వ సాయం
- పెండింగ్ నిధుల పంపిణీ
- విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు..
- ఉమ్మడిజిల్లాలో 6267 మందికి లబ్ధి


పంపిణీకి సిద్ధంగా ఉన్న ఉపకరణాలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు ఊతం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతోంది. దీంతో దివ్యాంగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలకు గాను 63 భవిత కేంద్రాలున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 32 భవిత కేంద్రాల్లో 3215 మంది, అనంతపురం జిల్లా 31 మండలాల్లో 3052 మంది దివ్యాంగ బాలలున్నారు. వీరిలో 1260 మందే భవిత కేంద్రాలకు వస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీరిలో చాలామంది నిరుపేదలే. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దివ్యాంగ బాలలకు చెల్లించాల్సిన అలవెన్సులను వారి తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సైతం వేతనాలు సక్రమంగా అందుతున్నాయి. బాలలకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

బాలలకు భత్యం విడుదల

గత ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వీర్యం చేసి దివ్యాంగులను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెలలోనే దివ్యాంగ బాలలకు రవాణా భత్యం కింద 10నెలలకు ఒక్కో విద్యార్థికి మూడువేలు, పీఎంశ్రీ పాఠశాల దివ్యాంగ బాలికలకు స్టైపండ్ కింద పదినెలలకు రూ 3వేలు, మిగతా పాఠశాలల్లోని బాలికలకు రూ 2వేలు, సొంతంగా బడికి వెళ్లలేని చిన్నారులకు సహాయకులకు వస్తున్న వారికి ఎస్కార్టు అలవెన్సు రూ.3వేలు చొప్పున మంజూరు చేసింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి 1936 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఇందులో నాలుగు రకాల అలవెన్సులకు గాను 58.24లక్షలు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసినట్లు కో-ఆర్డినేటర్ ఆనందబాబు తెలిపారు.

ఉపకరణాల పంపిణీ

గత ఏడాది జిల్లాలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉపకరణాలను తయారు చేయించారు. ఈమేరకు ఈనెల 8న కొత్తచెరువులో 277 మంది దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు 57, సీపీ వీల్‌చైర్‌లు 26, వినికిడి యంత్రాలు 64 టీఎల్ఎం (టీచర్‌లెర్నింగ్ మెటీరియల్‌కిట్లు) రోటేటర్లు 44, బ్రెయిలీ కిట్లు 2 ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏరా.. ఎలా ఉన్నావ్?

పూర్వ విద్యార్థుల కుశల ప్రశ్నలు

పెనుకొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏరా..! ఎలా ఉన్నావ్? ఎన్నేళ్లయ్యిందిరా చూసి. ఏమ్మా బాగున్నావా? పిల్లలెంతమంది? ఏం చేస్తున్నారు? అంటూ 33ఏళ్ల తరువాత కలిసిన వారంతా కుశల ప్రశ్నలు వేసుకున్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం శనివారం జరిగింది. మొత్తం 80మంది ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ చిన్న పిల్లల్లా మారిపోయారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు జ్యోతిర్మయి, జయలక్ష్మమ్మ, మనోరంజనమ్మ, నాగరాజు, శ్యామలమ్మను ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అంతా కలిసి ఓ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి పేద విద్యార్థులు, ఉపాధ్యాయుల వైద్య ఖర్చులకు చేయూతనందించాలని నిర్ణయించారు.

ఊరి బడిని ఉద్ధరిద్దాం

పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దల నిర్ణయం.. ఘనంగా 65వ వార్షికోత్సవం

బెళుగుప్ప, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మన ఊరి బడిని మనమే బాగు చేసుకుందామని పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దలు ఓ నిర్ణయానికి వచ్చారు. మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామ ప్రాథమిక పాఠశాల 65వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ పాఠశాల్లో చదివిన ఆదిమూర్తి డీఎస్పీగా ఎదిగి, పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలకు క్రీడా సామగ్రి, విద్యా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు కూడా అందిస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు మాజీ వైఎస్ ఎంపీపీ తిమ్మప్ప, నాగరాజు, శ్రీనాథ్, ఎర్రిస్వామి, మారుతీ, శ్రీనివాసులు, సిద్ధలతో పాటు మరికొంతమంది కలిసి వార్షికోత్సవానికి అయ్యే ఖర్చును మొత్తం భరించి, పాఠాలు చెప్పిన ఆనాటి గురువులను పెద్ద ఎత్తున సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచు రత్నమ్మ, రామాంజినేయులు, ఎంఈఓ మల్లారెడ్డి, హెచ్ఎం వెంకట సురేష్, ఉపాధ్యాయులు, వజీర్ బాషా, వేణుగోపాల్, సరస్వతి, నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేత్రదానం

అనంతపురం టౌన్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): అనంతపురంరూరల్ మండలం చంద్రబాబునగర్‌కు చెందిన రామన్న (80) మరణించడంతో ఆయన కళ్లను కుమారులు దానం చేశారు. రామన్న వయసు రీత్యా సహజమరణం పొందారు. ఆయన కుటుంబసభ్యులను సామాజిక కార్యకర్తలు అలంబన జనార్దన్, క్యాటరర్ రామకృష్ణ కలిసి కళ్లదానంచేస్తే మరో ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారని కోరారు. ఇందుకు రామన్న కుమారులు శ్రీనివాసులు, గోవింద్‌తోపాటు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో పాతూరు రెడ్‌క్రాస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డీవై కుళ్లాయప్ప ఐసెంటర్ డాక్టర్లు.. రామన్న కళ్లను సేకరించారు. రామన్న కుటుంబసభ్యులను డాక్టర్లు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.


రామన్న కళ్లను దానం చేస్తున్న కుటుంబసభ్యులు

క్షేత్ర స్వాహాయకురాలు..!


ఈ ఫొటోతో ఏడు మస్టర్లను అప్‌లోడ్ చేశారు..

- అవాక్కయ్యేలా అక్రమాలు
- ఒకే ఫొటోతో ఏడు మస్టర్లకు బిల్లులు
- ఒకేరోజు 1,400 మందికి ఉపాధి పని!
- బట్టబయలైన ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేరా?

నార్పల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఒక గ్రామ పంచాయతీలో ఒకేరోజు 1,400 మందికి ఉపాధి పని.. ఒకే ఫొటోతో ఏడు మస్టర్లకు బిల్లులు.. ఇవన్నీ నమ్మడానికే విడ్డూరంగా ఉన్నాయి. అయినా.. వాటిని చేశారు.. కాదు, చేసినట్లు చూపించారు.. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఓ క్షేత్ర సహాయకురాలు (ఫీల్డ్ అసిస్టెంట్). మండలంలోని ఓ పంచాయతీలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకురాలు స్వాహా పర్వానికి తెరలేపారు. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. రాజకీయ అండదండలంతో పేట్రేగిపోతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు మేట్లతో కుమ్మక్కై, ఉపాధి హామీ పనులకు రాకపోయినా వారి పేర్లను పెట్టి లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారు. ఇటీవలే ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను ప్రవేశపెట్టింది. అయినా.. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతరు చేయలేదు. ఆ పంచాయతీ పరిధిలో గత నెల 25 నుంచి నీటి సంరక్షణ కోసం ట్రెంచ్ పనులు చేపట్టారు. వాటికి 21 మంది కూలీలు మాత్రమే హాజరయ్యారు. వారి ఫొటో తీసి 56 మంది హాజరైనట్లు అప్‌లోడ్ చేసి, ఏకంగా 7 మస్టర్లకు బిల్లులు పెట్టారు. ఇలా గతంలో కూడా చేయడంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను డ్వామా పీడీ గట్టిగా మందలించారు. అయినా తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఎదురు సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

అవాక్కైన విచారణాధికారి

మండలంలో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ పనిచేస్తున్న పంచాయతీలో ఏపీడీ చెన్నకేశవులు విచారణ చేపట్టారు. ఈనెల 9న 1,400 మంది కూలీలు హాజరైనట్లు ఫొటోలతో మస్టర్లు రూపొందించి, అధికారులకు పంపారు. ఏపీడీ చెన్నకేశవులు ఆ ఫొటోలను పరిశీలించారు. ఇందులో వెయ్యి మందికిపైగా పనులకు రాలేదని గుర్తించారు. ఒకే ఫొటోనే అప్‌లోడ్ చేసినట్లు గుర్తించి అవాక్కయ్యారు. 'ఒక్కరోజే వెయ్యి మందిపైగా పనులకు రాకపోయినా వచ్చినట్లు ఏ ధైర్యంతో పెట్టారనీ, అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనుకున్నారా?' అంటూ ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై పూర్తి నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.


ఉపాధి కూలీలతో విచారణ చేస్తున్న ఏపీడీ చెన్నకేశవులు (ఫైల్)

పైసలిస్తేనే పని..

మండలంలోని ఆ పంచాయతీలో పని కల్పించాలంటే మొదట ఆ గ్రూప్ కూలీలు ఒక్కొక్కరు రూ.500 ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే ఆ వారం మొత్తంగా ఆ గ్రూప్‌కి పనులు పెట్టరని తెలసింది. ఎవరికైనా జాబ్ కార్డు కావాలంటే ముందుగా వెయ్యి ముట్టజెప్పాల్సిందేనన్న విమర్శలున్నాయి. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై టీడీపీ, జనసేన నాయకులు ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతాధికారికే బెదిరింపులు

తన అక్రమాలపై ప్రశ్నించిన అధికారినే ఆ ఫీల్డ్ అసిస్టెంట్ బెదిరించినట్లు తెలిసింది. సెలవులోగానీ, బదిలీపైగానీ వెళ్లిపోవాలనీ, లేదంటే అంతు చూస్తానని తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా వ్యవహరించాలనీ, చూసీచూడనట్లు వ్యవహరించాలని ఆ అధికారికి కొందరు రాజకీయ నాయకులు చెప్పినట్లు తెలిసింది. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలు ఆధారాలతో బట్టబయలైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

కొన్నింట అద్భుతం

ఐదు వెల్ఫేర్ కాలేజీలు, ఒక కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత

మొదటి సంవత్సరం కణేకల్లు వెల్ఫేర్, కూడేరు కేజీబీవీలో కూడా..



కూడేరు కేజీబీవీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య కాలేజీలు ఇంటర్ ఫలితాల్లో దుమ్మురేపాయి. సోషల్ వెల్ఫేర్, కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత కూడా నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు, ఎయిడెడ్ కాలేజీల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,897 మందికి గానూ 6,652 మంది పరీక్షలు రాశారు. వీరిలో 3,286 మంది పాసై.. 49.40శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 5,056 మందికిగానూ 4,921 మంది పరీక్షలు రాశారు. వీరిలో 3,500 మంది పాసై.. 71. 12 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

మొదటి సంవత్సరం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఆత్మకూరు 84.54 శాతంతో మొదటి స్థానంలో నిలువగా, బెళుగుప్ప 9.52 శాతంలో ఆఖరి స్థానంలో నిలిచాయి. కేజీబీవీల్లో కూడేరు 100 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, తాడిపత్రి కేజీబీవీలో 15 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూళ్లలో తాడిపత్రి 80.77 శాతంతో అగ్రస్థానం, యాడికి మోడల్ స్కూల్‌లో 23.86 శాతంతో ఆఖరు స్థానంలో నిలిచాయి. వెల్ఫేర్ కాలేజీల్లో కణేకల్లు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ(బాయ్స్) 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గొల్లలదొడ్డి ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో 11.90 శాతం మాత్రమే పాసయ్యారు. రెండు ఎయిడెడ్ కాలేజీల్లో 713 మందికిగాను 697 మంది హాజరు కాగా 159 మంది పాసయ్యారు. 22.81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బ్రహ్మసముద్రం జడ్పీ హైస్కూల్(ప్లస్)లో 20 మందికి ఐదుగురు మాత్రమే పాసయ్యారు. 25 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సెకెండ్ ఇయర్..

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,921 మందికిగానూ 3500 మంది పాసయ్యారు. 71.12 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఐదు వెల్ఫేర్ కాలేజీలు, ఒక కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆత్మకూరు జూనియర్ కళాశాలలో అత్యధికంగా 98.89 శాతం మంది పాసయ్యారు. అనంతపురం బాలుర జూనియర్ కళాశాలలో అత్యల్పంగా 41.22 శాతం ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీల్లో కూడేరులో అధికంగా 100 శాతం ఉత్తీర్ణత, యల్లనూరులో అత్యల్పంగా 9.52 శాతం ఉత్తీర్ణత వచ్చింది. 15 మోడల్ స్కూళ్లలో అధికంగా కణేకల్లు మోడల్ స్కూల్‌లో 90.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో కురుగుంట గర్ల్స్ కాలేజ్, పెద్దపప్పూరు బాయ్స్ కాలేజ్, ఉరవకొండ గర్ల్స్ కాలేజ్, కణేకల్లు బాయ్స్ కాలేజ్, బ్రహ్మసముద్రం గర్ల్స్ కాలేజ్‌లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గొల్లలదొడ్డి ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీ అత్యల్పంగా 56.52 శాతం ఉత్తీరతతో చివరిలో నిలిచింది.



లలిత, ఎంపీసీ (960)



హర్షవర్ధన్, ఎంపీసీ (966)



శ్రావణి (936)



విష్ణువరుణ్ 930

● ఉరవకొండ ప్రభుత్వ బాలబాలికల జూనియర్ కాలేజీల విద్యార్థులు గత ఏడాది కంటే ఎక్కువశాతం పాసయ్యారని ప్రిన్సిపాల్ మమత తెలిపారు. బాలికల కాలేజీలో ద్వితీయ సంవత్సరం 129 మందికిగానూ 104 మంది, ప్రథమ సంవత్సరం 182 మందికిగానూ 86 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఉమాదేవి 435 మార్కులు, హెచ్‌ఈసీ విద్యార్థిని లావణ్య 431 మార్కులు సాధించారు. ● బాలుర కాలేజీలో ద్వితీయ సంవత్సరం 119 మందికిగాను 92 మంది, ప్రథమ సంవత్సరం 147మందికి 68 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో జ్ఞానేశ్వర్ 454 మార్కులు సాధించాడు. ఒకేషనల్ గ్రూప్‌లో ప్రథమ సంవత్సరంలో 32శాతం, ద్వితీయ సంవత్సరం 70శాతం ఉత్తీర్ణత సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పథమ సంవత్సరంలో 99 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 36 శాతం, ద్వితీయ సంవత్సరం 74శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపల్ ప్రశస్థకుమారి తెలిపారు. వజ్రకరూరు మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 45శాతం, ద్వితీయ సంవత్సరం 52 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు.



శ్రావణి (961)

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. కేజీబీవీ మూడో స్థానంలో నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 216 మందికి గాను 151 మంది పాసై 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 203 మందికి గాను 191 మంది పాసై 94.5శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ మోహన్‌కుమార్ తెలిపారు. మొదటి సంవత్సరం సీఈసీ విద్యార్థిని సుశ్మిత 413 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని గౌరమ్మ 922 మార్కులు, బైపీసీ విద్యార్థిని శ్రావణి 961 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కేజీబీవీలో మొదటి సంవత్సరం సీఈసీ విద్యార్థులు 36 మంది గాను 30 మంది, ద్వితీయ సంవత్సరం 34 మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కమలమ్మ తెలిపారు. సాయికీర్తన 854, లావణ్య 828, ఐశ్వర్య 828 మార్కులు సాధించారని తెలిపారు.

అనంతకు 823.. శ్రీసత్యసాయి జిల్లాకు 604..

ఎస్సీ సబ్సిడీ రుణాల యూనిట్లు ఖరారు

రేపట్నుంచి దరఖాస్తులు... నిరీక్షణకు తెర

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్సిడీ రుణాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆయావర్గాల నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. ఈ మేరకు శనివారం ఉమ్మడి అనంత జిల్లాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాలకు రుణాలు అందించేందకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందులో భాగంగానే వివిధ రకాల రుణాల జాబితాను రూపొందించి యూనిట్ల వరకూ నిధులను కేటాయించింది. అనంత జిల్లాకు 823 యూనిట్లకుగానూ... రూ.34.21 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 604 యూనిట్లకు రూ.25.14 కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో కొంతకాలంగా సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గాలకు ఉపశమనం కలిగించిందనే చెప్పాలి. ఈనెల 14వతేదీ నుంచి apobmms వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

సెక్టార్ల వారీగా రుణాల వివరాలు...

అనంతపురం జిల్లాకు సంబంధించి ఐఎస్‌బీ సెక్టార్-1లో రూ.3లక్షల లోపు రుణాలను కేటాయించగా.. 151 యూనిట్లకు రూ.4.16 కోట్ల నిధులను విడుదల చేసింది. ఐఎస్‌బీ సెక్టార్-లో రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల లోపు రుణాలను కేటాయించగా... 418 యూనిట్లకు రూ.16.05 కోట్లు, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్(ఈ-ఆటోలు)లో రూ.3 లక్షలలోపు రుణాలు కేటాయించగా... 154 యూనిట్లకు రూ.4.62 కోట్లు, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల రుణాలను కేటాయించగా.. 93 యూనిట్లకు రూ.8.68 కోట్లు, అగ్రికల్చర్ సెక్టార్ (డ్రోన్ల)లో ఐదుగురు సభ్యులను గ్రూపుగా కలిపి 7 యూనిట్లకు రూ.70 లక్షల నిధులను విడుదల చేసింది.

శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఐఎస్‌బీ సెక్టార్-1లో రూ.3 లక్షల లోపు రుణాలను కేటాయించింది. ఇందుకు 110 యూనిట్లను కేటాయిస్తూ... రూ.3.02 కోట్ల నిధులను విడుదల చేసింది. ఐఎస్‌బీ సెక్టార్-2లో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల్లోపు రుణాలను కేటాయించింది. ఇందులో 305 యూనిట్లకు రూ.11.72 కోట్లు, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్(ఈ-ఆటోలు)లో రూ.3 లక్షలోపు రుణాలను కేటాయించింది. ఇందులో 115 యూనిట్లకుగానూ రూ.3.45 కోట్లు, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల రుణాలను కేటాయించింది. ఇందులో 69 యూనిట్లకు రూ.6.44 కోట్లు, అగ్రికల్చర్ సెక్టార్(డ్రోన్ల)లో ఐదుగురు సభ్యులు గ్రూపుగా కలిపి ఐదు యూనిట్లకుగానూ రూ.50 లక్షలు కేటాయించింది.

దరఖాస్తు ఇలా...

ఎస్సీ సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలి. లబ్ధిదారు వయసు 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఆటో రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు వ్యాలీడ్ లైసెన్స్, బ్యాడ్జి ఉండాలనే నిబంధన పెట్టారు. కుటుంబానికి ఒకరు మాత్రమే రుణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఉద్యోగులు, విద్యార్థులు అనర్హులు.



ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, సంక్షేమ శాఖల భవన సముదాయం

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాలను ఎస్సీ వర్గాలు సద్వినియోగం చేసుకోవాలి. ఐదు సెక్టార్ల వారీగా రుణాలను రూపొందించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో అన్ని రకాల రుణాలు కనిపిస్తాయి. అందులో ఎంపిక చేసుకోవాలి. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి.

- రాధిక, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

అట్టహాసంగా జోస్‌అలుక్కాస్ షోరూమ్ ప్రారంభోత్సవం

అనంతలో సందడి చేసిన హీరోయిన్ ఐశ్వర్య రాజేష్



రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐశ్వర్య రాజేష్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని సుభాష్ రోడ్డులో జోస్‌అలుక్కాస్ నూతన జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన జోస్‌అలుకాస్ షోరూంను జిల్లాలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జోస్ అలుకాస్ సంస్థ దేశంలో 100కిపైగా షోరూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. షోరూమ్‌లో రకరకాల జ్యువెలరీ కలెక్షన్లు చూస్తుంటే ఎంతో ముచ్చటగా ఉందన్నారు. జోస్‌అలుకాస్ సంస్థ ఎండీ పాల్ జె అలుకాస్ మాట్లాడుతూ... తక్కువ బరువుతో ఉన్న ప్రపంచస్థాయి డిజైన్లలో సిల్వర్, గోల్డ్, డైమండ్ జ్యువెలరీలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రతి రూ.50వేలు కొనుగోలుపై గోల్డ్‌కాయిన్, 8 గ్రాముల బంగారంపై రూ.2వేలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుందన్నారు. గతంలో ప్రజలకు బంగారంపై పెద్దగా అవగాహన ఉండేది కాదనీ, ఇపుడు బంగారు ఆభరణాల విక్రయాల్లో చిన్నస్థాయి దుకాణాల నుంచి కార్పొరేట్ సంస్థల వరకు పోటాపోటీని ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ కారణంగా బంగారం ఎక్కడ ఎలా కొనాలనే దానిపై ప్రజలకు అవగాహన ఏర్పడుతోందన్నారు. అనంతరం షోరూమ్ వెలుపల ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఐశ్వర్య రాజేష్ సినిమా పాటలకు డ్యాన్సులు వేయడంతోపాటు అభిమానులకు అభివాదం చేస్తూ ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో జోస్‌అలుకాస్ షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో గ్లోబల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



భవ్యశ్రీ | షాలిని | యశస్విని | మెర్సిగ్లాండ్ | అఫ్కరున్నీసా నహియా | అనూష | శ్రీసాయి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టీవీ టవర్ సమీపంలోని గ్లోబల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారని కళాశాల డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. జూనియర్ ఎంపీసీలో శ్రావణి, దూదేకుల అనూష, ముక్కర యామిని 464 మార్కులు, తనుశ్రీ, శాలిని 463, మేఘన 462, సుధ 461, వైష్ణవి, తేజస్విణి 460 మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపీసీలో అర్పిత 989, భవ్యశ్రీ, స్పందన 988, శివ భార్గవి 987, అఫ్కరున్నీసా నహియా 986, దివ్యశ్రీ, అశ్మిత 985, హారిక 981, సుశ్మిత, ప్రీతి 980 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో షరీఫా 433, యశస్విని, పూజిత 431 మార్కులు, సీనియర్ బైపీసీలో శ్రీసాయి, మెర్సీ గ్లాండ్ 977, యస్వంతి రెడ్డి 976, అనూష 973, కీర్తన 971 మార్కులు సాధించారని తెలిపారు.

కష్టం చేసి బతుకుతున్నా..! ఏనాడూ మాట పడలేదు..

తప్పు ఎవరు చేశారో ఎంక్వైరీ చేయాలి..

అంతేకానీ, వేధిస్తారా..?

ఆత్మహత్యకు ముందు గౌసుల్లా సెల్ఫీ వీడియో



గౌసుల్లా

తాడిపత్రి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసు స్టేషన్ ముందు రెండ్రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న బంగారం వ్యాపారి గౌసుల్లా మృతిచెందక మునుపు మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తనపై అనవసరంగా నింద మోపి, వేధిస్తున్నారంటూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. 'తృప్తి కోసం బంగారు పని చేస్తున్నా. 40 ఏళ్లుగా కష్టపడుతున్నా. ఏనాడూ ఎవరితోనూ మాట పడలేదు. ఎవరైనా వచ్చి తాకట్టు పెట్టిన బంగారం విడిపించి ఇవ్వమంటే అయ్యో.. పాపం.. అని సాయం చేస్తాం. అది దొంగ బంగారం అని ఎలా తెలుస్తుంది? దానిపై ప్రత్యేకంగా ముద్ర ఏమీ ఉండదు కదా. ఎవరో తప్పు చేస్తే నాపై నింద మోపారు. పోలీసులు విచారణ చేయాలే తప్ప.. నాపై దుర్భాషలాడకూడదు. అందరూ దొంగలు ఉండరు. మాట పడనివారు ఉంటారు. నిజాయితీగా బతికే వారూ ఉంటారు. అవేవీ ఆలోచించకుండా అమర్యాదగా మాట్లాడడం బాధ అనిపించింది. పిల్లలు పెద్దవారయ్యారు. వారి ముందే వచ్చి పదేపదే నన్ను విచారణ అంటూ పదే పదే పిలవడం బాధ కలిగించింది. నా పిల్లల కోసం బతుకుతున్నా. వారి కోసం కష్టపడి, న్యాయంగా బతకాలనుకున్నా. దేవుడు ఎక్కడో ఒకచోట ఇస్తాడనుకున్నా. కానీ, ఇలా.. అవమాన పడాల్సి వస్తుందనుకోలేదు.' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేసిన వివాదంలో పోలీసులు, మరికొందరు వేధించడంతో గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆయన వీడియో బయటపడడం చర్చనీయాంశమైంది.

తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలో మహమ్మద్ రఫీ అనే వ్యక్తి పది తులాల బంగారాన్ని తాకట్టుపెట్టి 2023 డిసెంబరులో రుణం తీసుకున్నాడు. దీనికి అదే కంపెనీలో పనిచేస్తున్న అతని స్నేహితుడు జిలాన్‌బాషా సాయం చేశాడు. ఆ తరువాత రఫీకి తెలియకుండా తాకట్టు బంగారాన్ని జిలాన్ బాషా అమ్మేశాడు. 'వేలానికి వచ్చిన బంగారం.. తక్కువ ధరకు ఇప్పిస్తా' అని చెప్పి గౌసుల్లాకు విక్రయించాడు. సరిగ్గా ఏడాది తరువాత తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు జిలాన్ బాషాను రఫీ సంప్రదించాడు. అతను స్పందించకుండా కాలం గడిపి, రెండు నెలల క్రితం ఊరు విడిచి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానే గాలించి, బళ్లారిలో ఉన్న జిలాన్‌బాషాను పట్టుకు వచ్చి రెండు రోజుల క్రితం పోలీసులకు అప్పగించాడు. బంగారాన్ని గౌసుల్లాకు విక్రయించానని జిలాన్‌బాషా చెప్పాడు. దీంతో పోలీసులు.. గౌసుల్లాను పిలిపించారు. వేలంలో అమ్ముతున్నారని జిలాన్ చెప్పడంతో తాను మూడు తులాల బంగారాన్ని కొనుగోలు చేశాననీ, డబ్బు అప్పుడే చెల్లించానని గౌసుల్లా.. పోలీసులకు తెలిపాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా గౌసుల్లాను పోలీసులు స్టేషన్‌కు పిలిపించడం, ఆయన ఇంటి వద్దకు మహమ్మద్ రఫీ, పోలీసులు వెళ్లడం వంటి ఘటనలు జరిగాయి. ఎస్‌ఐ గౌస్ బాషా శుక్రవారం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారు. తాను కొన్నది మూడు తులాలేననీ, డబ్బు కూడా ఇచ్చేశానని గౌసుల్లా చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం స్టేషన్ బయటకు వెళ్లిన గౌసుల్లా.. తన ద్విచక్రవాహనంలో ఉన్న రసాయనం బాటిల్‌ను తీసుకుని తాగేశాడు. తర్వాత మృతిచెందాడు. పోలీసుల తీరుతో ఆవేదనకు లోనయ్యాడో గౌసుల్లా వీడియోలో వివరించాడు.

17న ఎస్సీ, ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి సమస్యలపై ఈనెల 17న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజలు హాజరై, సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

ఒకేషనల్ కోర్సుల్లో 2,390 మంది ఉత్తీర్ణత

అనంతపురం విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 2,390 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఫస్ట్ ఇయర్‌లో 2311 మందికిగాను 2111 మంది హాజరు కాగా 1100 మంది ఉత్తీర్ణులయ్యారు. 52.11 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కంబదూరు కేజీబీవీలో అత్యధికంగా 97.37శాతం పాస్ కాగా కణేకల్లు జూనియర్ కాలేజీలో ఒకేషనల్ విద్యార్థులూ ఒక్కరూ పాస్ కాలేదు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1756 మందికిగాను 1665 మంది విద్యార్థులు హాజరుకాగా 1,290 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 77.5 శాతం ఉత్తీర్ణత వచ్చింది. కేజీబీవీ యాడికి, కేజీబీవీ గుత్తిలో 100శాతం విద్యార్థులు పాసయ్యారు. అత్యల్పంగా కణేకల్లు జూనియర్ కాలేజ్‌లో 59.3 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

తగ్గిన చీనీ ధర

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ ధర తగ్గింది. శనివారం రూ.20 వేల దిగువకు పడిపోయింది. మార్కెట్‌కు 1,085 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. టన్ను గరిష్ఠంగా రూ.19,510, కనిష్ఠంగా రూ.2,560, సరాసరి రూ.13వేలు ధర పలికిందన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరులో ఒక ఇంటిలో దొంగతనానికి ప్రయత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడి నుంచి పరారు కావడంతో గ్రామానికి చెందిన ప్రజలు 21కిలోమీటర్ల దూరంలోని తగరకుంటలో పట్టుకొని అనంతపురం పోలీసులకు అప్పగించారు. వీరంతా రాజస్థాన్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీరు కారులో వచ్చి దొంగతనాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. వీరిని ప్రత్యేక బృందంవారు విచారిస్తున్నట్లు సమాచారం.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

నార్పల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు మహేష్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ సాగర్ విలేకరుల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. వారు తెలిపిన మేరకు బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చి ఆడుకుంటుండగా బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్ అనే యుకుడు గొర్రెల ఎరువుల కోసం అక్కడికి వెళ్లాడు. ఆ ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఆ బాలిక ఒంటరిగా ఉందని గమనించిన మహేష్ ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బొమ్మలాటపల్లి మిట్ట వద్ద ఉన్నట్లు సీసీ కెమెరాల ద్వారా గమనించి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ



న్యూస్ బాక్స్

లక్ష్మీగణపతి దేవాలయ వార్షికోత్సవం


వెండికవచాలంకరణలో హనుమద్ సమేత లక్ష్మీగణపతి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకాష్‌రోడ్డులో వెలసిన లక్ష్మీగణపతి మందిర పదో వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే మూల విరాట్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణనాథునికి కుడుముల మాలలు, ఆంజనేయస్వామికి వడమాలలు సమర్పించారు. ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించి, పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు మణికంఠబాబు, సుబ్బారావు, నాగవినూత్న, భక్తులు పాల్గొన్నారు.

విషు వేడుకలను విజయవంతం చేయండి

● అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు

అనంతపురం కల్చరల్/బుక్కరాయ సముద్రం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్టపై వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించనున్న విషు వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా 13న రాత్రి భక్తులు ఆలయంలో నిద్రించి, 14న వేకువజామున స్వామిదర్శనం చేసుకుంటారని తెలిపారు. అలాగే అయ్యప్పస్వామి పాదాల వద్ద ఉంచి పూజించిన నాణేలను భక్తులకు వితరణ చేస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయండి

● ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని విజయవంతం చేయాలని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు జడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తామన్నారు. అనంతరం 10.30కు జడ్పీలోని డీపీఆర్‌సీ సమావేశపు హాల్‌లో వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

● రామగిరి: మండలంలోని పేరూరులో సోమవారం నిర్వహించే అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలని దండోరా నాయకులు శ్రీరాములు, వెల్డింగ్ గంగన్న, మాజీ సర్పంచ్ గంగాధర, జేసీబీ పెద్దన్న, బేల్దారి పెద్దన్న శనివారం ఒక ప్రకటనలో కోరారు. సోమ వారం ఉదయం అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాల వేసి, కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించాలి

● శింగనమల: నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం అంబేడ్కర్ 135 జయంతి ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని, అధికారులు లెవరైనా నిర్లక్ష్యం చేసే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

తప్పెట పోటీలు

శింగనమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ జయంతి సందర్భంగా శింగనమలలో తప్పెట పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి చిన్నజలాలపురం ఓబిలేసు, మండల కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద పోటీలు ఉంటాయన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంతులూరుకు చెందిన టీడీపీ కార్యకర్త ఎట్టి నాగరాజు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. అతడి కు టుంబానికి సీఎం సహాయనిధి కింద రూ. 2.70 లక్ష లు మం జూరైంది. ఆ చెక్కును టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. తెలుగుయువత నాయకులు వెంకట్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. లహరి డ్యాన్స్ ఫిట్నెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫోక్, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నగరంతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కార్యాక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఓ కోరారు.

ఆ కేసులో రాజీ కోరింది ఫయాజే

● పీపీ హరినాథ్‌రెడ్డి

అనంతపురం క్రైం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో తాను రాజీ కోరలేదని న్యాయవాది ఫయాజే కోరారని పీపీ హరినాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న స్కంద వెంచర్‌లో ధనలక్ష్మి కుమారుడిని రోనియా అనే మహిళ హత్యచేసిందనే కేసు విషయంలో తాను పీపీగా ఉన్నానన్నారు. ఈ కేసు విషయంలో తనపై ముఖ్యమంత్రి, హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌తో పాటు పలువురికి ఫిర్యాదుచేశారన్నారు. కానీ ఇక్కడున్న జిల్లా న్యాయాధికారికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. తాను ఐదేళ్లుగా పీపీగా పనిచేస్తున్నా తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనుంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పామిడికి చెందిన రవిప్రకాష్ ద్విచక్ర వాహనంలో అనంతపురం వైపు వెళుతున్నాడు. సిరివరానికి చెందిన వ్యక్తి కనుంపల్లి నుంచి గుడ్డాలపల్లికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఈ ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇమాంషావలి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం


స్వామివారి సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని చియ్యేడు గ్రామంలో వెలసిన హజరత్ షేక్ ఇమాంషావలి దర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శనివారం పకీర్ల జల్సాతో దర్గాలో గంధం పూజ నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. సాయంత్రం పూల పల్లకీలో గ్రామవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఆదివారం ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా మేనేజర్ హాజీ షేక్ గఫూర్ సాహెబ్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల సత్తా

● ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు
● పలువురు విద్యార్థులకు అత్యధిక మార్కులు


ఎస్ గ్రీష్మ(బైపీసీ) రమణి(ఎంపీసీ) సుచిత్ర(సీనియర్ సీఈసీ) నర్మద(జూ. సీఈసీ)

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని కురుగుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు చెందిన జూనియర్ ఇంటర్ విద్యార్థులు 156 మంది పరీక్ష రాయగా 131మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగ జ్యోతి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 153మంది పరీక్ష రాయగా 152మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్. షర్మిళ, తనుశ్రీబాయి 460మార్కులు, బైపీసీలో ఎం.జ్యోతిక, డి.అనురాధ 429మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో డి.రమణి 982మార్కులు, బైపీసీలో గ్రీష్మ 985 మార్కులు సాధించారన్నారు. అలాగే కురుగుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ అండ్ కళాశాలలో జూనియర్ ఇంటర్ సీఈసీలో 98.50శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. 69మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 68మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ సీఈసీలో 64మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్‌లో 44మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులు కాగా 15మందికి 900కిపైగా మార్కులు వచ్చాయన్నారు. ఎం.సుచిత్ర 957 మార్కులు వచ్చాయన్నారు. జూనియర్ ఇంటర్‌లో 45మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులు కాగా, నర్మద 481 మార్కులు, మహిత 473, జాహ్నవి 472 మార్కులు సాధించారని తెలిపారు.


యమునాకుమారి భవ్య భూమిక నక్షత్ర

●శింగనమల: ఇంటర్మీడియల్ ఫలితాల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరంలో 29 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 21 మంది ఉత్తీర్ణులు కావడంతో 73 ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 22 మది విద్యార్థులు హాజరుకాగా 14 మంది ఉత్తీర్ణులై 66 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో విద్యార్థిని యమునాకుమారి విద్యార్థి 877/1000, భవ్య 827/1000 మార్కులు సాధించారు. మెదటి సంవత్సరంలో భూమిక 455/500, నక్షత్ర 427/ 500 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ గీతారాణి తెలిపారు. శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సవరంలో 57 మంది విద్యార్థులకు గాను 30 మంది, ద్వితీయ సంవత్సరంలో 25 మందికిగాను 14 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు.


శిల్ప(472) ఝాన్సీ(467) టి. సుజన(906) మనీష(901)

గార్లదిన్నె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు సత్తా చాటారు. శనివారం వెలువడిన ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 40 మంది ఒకేషనల్ విద్యార్థినులకు గాను 34 మంది ఉత్తీర్ణులై 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగసత్య తెలిపారు. వీరిలో జి. శిల్ప 500 మార్కులకు గాను 472, ఝాన్సీ 467 మార్కులు సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 29 మందికి 22 మంది ఉత్తీర్ణ సాధించి 75 శాతం వచ్చినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్స రం ఫలితాల్లో తూర్పింటి సుజన 1000 మార్కులకు 906, మనీష 901 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో... మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇం టర్ ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జూనియర్ ఇంటర్‌లో 85 మంది పరీక్షలకు హాజరుకాగా 51 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎంఈసీలో పి. జ్యోత్స్న 486/500, ఎంపీసీలో బండారు సొలోమాన్ బాబు 447/470, బైపీసీలో డి. కీర్తన 399/440, సీఈసీలో బి.హేమలత 448/500మార్కులు సాధించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్‌లో 54మందిగాను..41మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో బాల కిశోర్‌రెడ్డి 946, బైపీసీలో పి.సునీత 844, సీఈసీలో మాబున్ని 826 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


పి.జ్యోత్స్న సొలోమాన్‌బాబు కీర్తన హేమలత బాల కిశోర్‌రెడ్డి సునీత మాబున్నీ

ప్రైవేట్ కాలేజీల విద్యార్థుల హవా..!


నారాయణ కాలేజీలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో పలు ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల విద్యార్థులు సత్తా చాటారు. శనివారం విడుదలైన ఫలితాల్లో జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్‌లో స్టూడెంట్స్ సత్తాచాటారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. స్వీట్లు అందించి ప్రశంసించారు. టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

నారాయణ జూనియర్ కాలేజీలో... ఇంటర్ ఫలితాల్లో పలువురు అత్యధిక మార్కులు సాధించినట్లు నారాయణ కళాశాల కోర్ డీన్ బద్రినాథ్, డీన్ శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ డీన్లు వెంకట నారాయణ, సుధాకర్‌రెడ్డి, డీజీఎం వెంకట్రామిరెడ్డి ప్రకటించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో పావని, అతికాఖానం 466 మార్కులు, ప్రణవి, అరవిద్‌కుమార్, జస్వంత్‌రెడ్డి జ్యోతి, ప్రార్థన్, రుచిత 465, బైపీసీలో అప్సన 436, షేయిక్ అయేష 433 మార్కులు సాధించారు. సెకెండ్ ఇంటర్ ఎంపీసీలో అనుష్కదేవి 991, షేయిక్ పైజా నిఖత్ 991, బైపీసీలో తేజస్విని 988, నిత్యశ్రీ 986 మార్కు లు సాధించారు. వారిని ప్రిన్సిపాళ్లు శైలజ, హిమబిందు, రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, శ్రీధర్‌బాబు, శిఖామణి, బాలన్న, లక్ష్మన్న తదితరులు అభినందించారు.

తేజ జూనియర్ కాలేజీలో... తమ కాలేజ్ విద్యార్థులు భారీగా మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి పేర్కొన్నారు. సెకెండ్ ఇయర్‌లో రమ్య 991 మార్కులు, విజయలక్ష్మి 987, పాతిమాసుమయా 986, నవనీద్‌కృష్ణ 986, మానస 984, వినుత 983 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో రేష్మవి 435 మార్కులు, కృష్ణచైతన్య 430, నవనీత 430, అక్షర 429, ప్రజ్ఞరెడ్డి 427 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీలో కీర్తిశ్రీ 465, షమీరా 465, ఇందువర్ధన్ 464, నారాయణరెడ్డి 464, లోహిత్‌రెడ్డి, నితిన్ 463, సతీష్ రెడ్డి 462, వరుణ్ సందేశ్, హరిప్రియ, చంద్ర పౌర్ణమి, కావ్య 462, యశ్వంత్‌రెడ్డి 461, పూజితరెడ్డి 460, హేమంత్‌కుమార్ 460, రాకేష్ 460 మార్కులు సాధించారు. వారిని డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి అకడమిక్ డైరెక్టర్ అనిల్‌కుమార్, డైరెక్టర్లు సాయి చైతన్య, నేత్రవాణి, కోఆర్డినేటర్లు రాజశేఖర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఇతర సిబ్బంది అభినందించారు.

నలందా జూనియర్ కాలేజీలో... ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 470 మార్కులకు విద్యార్థులు కనిష్క 465, క్రిష్ణ ప్రణీత్‌రెడ్డి 463, అజయ్‌కుమార్ 462, అనిల్ 426, జ్యోతిక 460 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు అశోక్ 426, ఎంఈసీలో 500 మార్కులకు గగనశ్రీ, నిషాన్ 478, అచిత్ జైన్ 474, సీఈసీలో 500 మార్కులకు లక్ష్మీపేర్ 472, మహేశ్వరి 463, ఉమామహేశ్వరి 460 మార్కులు సాధించారు. సెకెండ్ ఇయర్ ఎం పీసీలో హర్షిత చౌదరి, గగనశ్రీ 985, సాయి అశోక్, నాగతేజ 984 , ప్రియాంక 982, షణ్ముఖి, మహిత 980, బైపీసీలో యల్లవి 970, ఇందు 964 మార్కులు సాధించారు. ఎంఈసీలో శబరి నాథ్ 969 మార్కులు, పర్హాన 959, సీఈసీలో శివకుమార్ 960, పల్లవి 949, నివేదిత 948 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాళ్లు ఖాజీబాబు, వినోద్‌బాబు ప్రకటించారు.

వివేకానంద కాలేజీలో... జూనియర్, సీనియర్ ఇంటర్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపినట్లు వివేకానంద విద్యాసంస్థల అధినేత రవీంద్ర పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఓబులేసు 465 మార్కులు, అమృత 464, సంతోష్‌కుమార్ 463, బైపీసీలో శాంతి, కీర్తన, సాయి క్రిష్ణ, అజయ్ 433, నాగేశ్వరి, గురుప్రసాద్ 431, సాయిచందన 430 మార్కులు సాధించారు. సీఈసీలో నందిని 482 మార్కులు, విజయ్ 475, కీర్తన 460 సాధించారు. సెకెండ్ ఇయర్ ఎంపీసీలో నరేంద్ర 987 మార్కులు, నగేష్, హనుమంతు, రమేష్, రా జేష్ 986, వంశీ, గురుకిరణ్ 985, బైపీసీలో పోషణ 985, సీఈసీలో మమత 967, అశ్విని 962, జ్యోత్స్న 956 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, రాంగోపాల్ నాయుడు, జేవీ రమణ, బ్రహ్మో నందరెడ్డి, సంజీవరాయుడు పాల్గొన్నారు.


ఎస్ఆర్ కాలేజీలో... ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు జోనల్ ఇన్‌చార్జ్ శివకుమార్, ఏజీఎం జగన్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో శిరీష 435 మార్కులు, ఎంపీసీలో రోహిత శివవర్మ 465 మార్కులు, హేమచరణ్‌రెడ్డి 465, చరణ్‌కుమాంర్ 464, సాహితి 464, ఇంద్రాణి 464 మార్కులు సాధించారని తెలిపారు. ఇద్దరు 465 మార్కులు, తొమ్మిది మంది 464, ఐదుగురు 463, నలుగురు 462, ఇద్దరు 461, పదిమంది 460 మార్కులు సాధించారని వారు తెలిపారు.

శ్రీచైతన్య కాలేజీలో... ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో శ్రీచైతన్య కాలేజ్ విద్యార్థులు షేక్ ఫిర్దోస్ 470కి 466 మార్కులు, బైపీసీలో అనన్యశౌరి, ఖుర్షియా తహసీన్ 440కి 435మార్కులు సాధించారు. ఎంపీసీలో 460 మార్కులు 18 మందికి, బైపీసీలో 430 మార్కులు 9 మందికి వచ్చాయని ఏజీఎం మురళీకృష్ణ, డీన్ ప్రసాద్ శర్మ, ప్రిన్సిపాళ్లు దుర్గేష్, కిశోర్ పేర్కొన్నారు.

సీవీ రామన్ గర్ల్స్ కాలేజీలో... ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో నిత్యశ్రీ 466 మార్కులు, పవిత్ర 463, ప్రదీప్‌కుమార్, మాధవి 462, బైపీసీలో జీవన 431, షమీరా 427 మార్కులు సాధించారు. సెకెండ్ ఇయర్ ఎంపీసీలో అర్చన 985 మార్కులు, నోరిత 981, వినోద్ 981, కీర్తన 967 మార్కులు సాధించారు.

వికాస్ జూనియర్ కాలేజీలో... ఫస్ట్ ఇయర్ సీఈసీలో చరణ్ తేజ్ 500కి 480 మార్కులు, ఎంపీసీలో జోషిక 463, సాయి దర్శిని 463, జశ్వంత్ 460, సెకెండ్ ఇయర్ ఎంపీసీలో మైథిలి రాఘవన్ 1000కి 978 మార్కులు సాధించారు. వారిని కళాశాల డైరెక్టర్లు జయభాస్కర్, సుబ్రహ్మణ్యం అభినందించారు.

శ్రీసాయి విద్యాసంస్థల్లో... సెకెండ్ ఇంటర్ ఫలితాల్లో హారిక 974 మార్కులు, తేజశ్విని 969, చందన 951, హర్షిత 951, షాలిని 946 , నక్షత్ర 944 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో అవంతిక 447 మార్కులు, స్వీటి 433, వసంత 432, అశ్విత 431, మానస 411, కీర్తన 392 మార్కులు సాధించారని విద్యా సంస్థల అధినేత మాధురీ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. అలాగే నగరంలోని కాగ్నిజెంట్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఉదయశ్రీ 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించింది.


ఉదయశ్రీ(461/470)


ఎస్ఎల్ఎన్ విద్యార్థుల ప్రతిభ

● అనంతపురం రూరల్: మండలంలోని ఆలమూరురోడ్డులోని శ్రీసత్యసాయి అండ్ ఎస్ఎల్ఎన్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీలో 470మార్కులకు స్రవంతి 465, ఆర్ దీపిక 463, పవన్‌ప్రసాద్‌రెడ్డి 461, చరిత 460 సాధించారని కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ తెలిపారు. బైపీసీలో 440మార్కులకు ఎస్ లిఖిత 433, సంగీత 431, సీఈసీలో 500మార్కులకు సుచిత్ర 471 మార్కులు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో భార్గవి 981, అనుషా 981, స్పందన 980, సీఈసీలో హర్షిత 955 సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. వారిని కరస్పాండెంట్ తోపాటు ప్రిన్సిపాళ్లు రామిరెడ్డి సోమశేఖర్, వెంకటరమణ అభినందించారు.

ఇంజనీరింగ్ విద్యకు జేఎన్టీయూ ఆదర్శం

● సంతృప్తి వ్యక్తంచేసిన ఎన్‌బీఏ బృందం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దేశంలోని టెక్నాలజికల్ యూనివర్సిటీల్లో జేఎన్టీయూకి ప్రత్యేక స్థానముంది. ఆ స్థానాన్ని పదిలంగా కొనసాగిస్తున్న వర్సిటీ కాన్స్టిట్యూట్ కాలేజ్‌ను ఇంజనీరింగ్ విద్యకు ఆదర్శంగా తీర్చిదిద్దారంటూ నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. శనివారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను ఎన్‌బీఏ బృందం సందర్శించింది. బెంగళూరు బీఎంఎస్ కాలేజ్ నుంచి రవికుమార్ చైర్మన్‌గా, ఢిల్లీ జేఎన్‌యూ నుంచి అగర్వాల్, అన్నా యూనివర్సిటీ నుంచి బసవరాజ్, ఐఐటీ ధార్వాడ్ నుంచి రాంజీ సభ్యులతో కూడిన బృందం ఉదయం కళాశాలకు చేరింది. మధ్యాహ్నం వరకు సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలను సందర్శించారు. సాయంత్రం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను పరిశీలించారు.


కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధికారులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

గోప్యతనూ పాటిస్తూ... సీనియర్ ప్రొఫెసర్లతో కూడిన ఎన్‌బీఏ బృందం కళాశాల సందర్శన సమాచారంలో గోప్యతను పాటించింది. బెంగళూరునుంచి రోడ్డు మార్గాన నేరుగా కళాశాలకు ఉదయం 8.45 గంటలకే చేరుకుంది. హంగు ఆర్భాటాలకు స్వస్తిచెప్పారు. సాధారణ ప్రొఫెసర్లులాగా కళాశాలకు వచ్చి ఎన్‌బీఏ ఆదేశాలను పూర్తిచేసుకున్నారు. అనంతరం వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డితో పాటు మరికొందరు వర్సిటీ డైరెక్టర్లతో ఎన్‌బీఏ బృందం సమీక్షించింది. ఇంకా మెరుగైన అవకాశాలు అందిపుచ్చుకోవడంపై సూచనలు సలహాలు ఇచ్చారు. కళాశాలలోని ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఎన్‌బీఏ బృంద పర్యటనను విజయవంతం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. కళాశాల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలని పేర్కొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

● నార్పల: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నార్పల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బీ బాలప్ప శనివారం తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పుర్వీక 433, కీర్తన 422, బైపీసీలో ఆశ 354మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో సాయికుమార్ 927, బైపీసీలో లహరి 918, ఎంపీసీలో మోహన్‌రెడ్డి 883 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


సాయిగీత రుచిత

● బుక్కరాయసముద్రం: ఇం టర్ ఫలితాల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన 36 మంది విద్యార్థులకు గాను 33 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కే గీత అనే విద్యార్థిని 952 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగవేణి తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాలలో 40 మందికి గాను 35 మంది ఉతీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిలో సాయి గీత అనే విద్యార్థిని 482/500, రెండో స్థానంలో రుచిత 477/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


పూజిత(902) తనూజ(428/470)

● చెన్నేకొత్తపల్లి: ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక కేజీబీవీ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ద్వితీయసంవత్సరం ఎంపీసీ విభాగంలో 16 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణులై 87.5శాతం ఉత్తీర్ణత నమోదైంది. అందులో విద్యార్థిని పూజిత ఎంపీసీ (902/1000), గణిత (876/1000) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ సువర్ణ తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 33మందికి గాను 20 మంది ఉత్తీర్ణులై 60.6శాతం సాధించారన్నారు. అందులో విద్యార్థిని తనూజ ఎంపీఈసీ 428/470), ప్రవల్లిక (394/470) మార్కులు సాధించారన్నారు. మోడల్ కళాశాల ద్వితీయ సంవత్సరంలో 24 మందికి గాను 17 మంది పాసై 71 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 39 మంది పరీక్షలు రాయగా 14 మంది పాసు కాగా 36శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

● రాప్తాడు: ఇంటర్ ఫలితాల్లో స్థానిక కేజీబీవీ, ఆదర్శ కళాశాలల్లో విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించారు. కేజీబీవీ మొదటి సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని వనజ బైపీసీలో 420/440 సాధించింది. రెండో సంవత్సరం బైపీసీలో ప్రమీలరాణి 941/ 1000, భార్గవి 928/1000 మార్కులు సాధించారు. ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినుల్లో యమున ఎంపీసీలో 434/ 470, కిరణ్మయి బైపీసీలో 398/440, జ్ఞానేశ్వరి 440/500 సాధించారు. రెండో సంవత్సరంలో విద్యార్థిని మేఘన ఎంపీసీలో 962/1000, హర్షిత 956/1000,, హరిణిపూర్ణ సీఈసీలో 934/1000 మార్కులు సాధించినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

● రామగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో 86.25 ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో 45 మంది పరీక్షలు రాయగా 35 మంది, రెండో సంవత్సరంలో 35 మంది పరీక్షలు రాయగా 34 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అదేవిధంగా మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం 74 మందికిగాను 56 మంది, రెండో సంవత్సరంలో 33 మందికిగాను 32 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సర్వేశ్వరి తెలిపారు. పరీక్షలకు ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. అదేవిధంగా కేజీబీవీలో మొదటి సంవత్సరం 38 మందికిగాను 26 మంది, రెండో సంవత్సరంలో 16 మందికిగాను 16 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ సౌమ్యలత పేర్కొన్నారు.

వైభవంగా రాములోరి బ్రహ్మరథోత్సవం


రథంలో సీతారామలక్ష్మణులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఏడో రోజున శనివారం బ్రహ్మరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి, మడుగు తేరు లాగారు. అనంతరం ఆలయ ఆవరణలో రథాంగహోమం నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో ఉత్సవిగ్రాహాలనుఉంచి ఊరేగించారు. రాత్రికి దశహారతులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై శ్రీ నృత్యశిక్షణాలయం చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో స్వామివార్లకు నృత్యనీరాజనం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, భక్తమండలి నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు చౌదరి, జీజే వేణు, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, హర్ష, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

వసీం నీకు మైండ్ పనిచేస్తోందా..?

● ఆర్అండ్‌బీ అతిథి గృహంతో నాకేంటి సంబంధం: ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వసీం నీకు మైండ్ పనిచేస్తోందా..? ఆర్అండ్‌బీ అతిథి గృహం తాళాలు ఇవ్వకపోతే నేను బాధ్యుడినా అంటూ మేయర్ వసీంపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. మేయర్ వసీం, యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ నిర్వహించేందుకు ఆర్అండ్‌బీ అతిథి గృహం అడిగారని, అయితే అక్కడి సిబ్బంది ఎమ్మెల్యే మీకు తాళాలు ఇవ్వకూడదని చెప్పినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నగర ప్రథమ పౌరుడికి, ముస్లిం లకు అవమానం అనే విధంగా ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అసలు ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్వహణతో తనకేంటి సంబంధం అని నిలదీశారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్వహణ పూర్తిగా ఆ శాఖ అధికారులు, కలెక్టర్ పరిధిలో ఉంటుందన్నారు. తనకు సంబంధం లేని విషయాన్ని తనకు అంటగట్టాలని చూడడం పద్ధతి కాదన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, నగర ప్రథమ పౌరుడు ఇంత అవివేకంగా ఉండటం సరికాదన్నారు. మరో సారి ఇలాంటి నిరాధారమైన అవాస్తవాలను ప్రచారం చేస్తే చట్టపరంగా ముందుకు వెళతామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గోవింద భజనలు


గోవింద భజనల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గోవింద సేవా సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న 365 శనివారాల గోవింద భజనల్లో భాగంగా శని వారం నగరంలోని నరే సేపల్లి సురేష్ నివాసం లో 200వ శనివారం భజనలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వెంక టేశ్వరస్వామికి ప్రత్యేక పూజలతో సామూహిక భజనలు చేశారు. మహా మంగళహారతి, నివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో గోవింద సేవా సంఘం అధ్యక్షుడు ఈరంటి రమణ, రాజు రాఘవేంద్ర, కలవల మల్లికార్జున, ఈరంటి వెంకటస్వామి, రాజేష్, జయంతి, ప్రసాద్, నాగభూషణం, ఆది, బాబు, గోగ్గరపు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల సత్తా



శివజ్యోతి (సీఈసీ, 919) సునీత (బైపీసీ, 964) బానుశ్రీ (ఎంపీసీ, 935) వినోలియా (బైపీసీ, 405)

గుత్తి,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఈ క్రమంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 43శాతం, ద్వితీయ సంవత్సరం 76శాతం ఉత్తర్ణీత సాధించినట్లు ప్రిన్సిపాల్ మీనాక్షితెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో సునీత 964, ఎంపీసీలో బానుశ్రీ 935, సీఈసీలో శివజ్యోతి 919, ఎంఈసీలో నందిని 818మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో వినోలియా 405, ఎంపీసీలో ముబీనా 446, సీఈసీలో గౌతమి 450, ఎంఈసీలో శ్రీకళ 418మార్కులు సాధించారన్నారు. అలాగే మోడల్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 50శాతం, ద్వితీయ సంవత్సరంలో 73శాతం ఉత్తీర్ణత సాధించనట్లు ప్రిన్సిపాల్ ఉష తెలిపారు. ఇందులో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో విజయధాత్రి 937, సీఈసీలో వేదవతి 931, బైపీసీలో పవన్‌కుమార్ 924మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో భూమిక 446, బైపీసీలో చందు 390, షేక్ నయీమ్ 465మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

గుంతకల్లు పట్టణంలో..

గుంతకల్లుటౌన్: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మహముదాబేగం తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎస్.షాను 426 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో ఉమామహేశ్వరి 897 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే శంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఐఎంపీసీలో సింగిబాషా 453, ద్వితీయ సంవత్సరంలో కే.రామ్‌చరణ్ 974మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బైపీసీలో తబసుమ్ అక్తారీ 403, సీఈసీలో రసీదాబాను 446మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సీఎస్ఈలో నితిన్‌కోమల్ చక్రవర్తి 929మార్కులు సాధించారు. శక్ర జూనియర్ కళాశాలలో ఎంపీసీలో దాదాఖలందర్ 967, బైపీపీలో షబానాజ్ 993 మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

బెళుగుప్ప మండలంలో..



జూలీ బైపీసీ,909 పవిత్ర బైపీపీ, 890 గంగమ్మ (బైపీసీ, 975)

బెళుగుప్ప: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు సత్తాచాటారు. ఫస్టియర్‌లో 35 మందికి గాను 28 మంది ఉత్తీర్ణులయ్యారని, ద్వితీయ సంవత్సరంలో 29 మందికి 28 మంది ఉత్తీర్ణులయ్యారని ఎస్‌వో నాగరత్నబాయి తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో జూలీ 1000కి గాను 909 సాధించి మొదటి స్థానం, పవిత్ర 890 మార్కులతో రెండోస్థానం, 884 మార్కులతో మేఘన మూడో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మండలంలోని అంకంపల్లికి చెందిన గంగమ్మ అత్యధికంగా 975 మార్కులు సాధించింది. ఈమె గుత్తి రజాపురం గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించింది.

కుందుర్పి మండలంలో..



సౌమ్య సీఈసీ, 920 మేఘన ఎంపీసీ 908

కుందుర్పి: ఇంటర్ ఫలితాల్లో మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులుసత్తాచాటారు. మొదటి సంవత్సరంలో 134 మందికి గాను 42 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 104 మందికి 77 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో 920 మార్కులు సాధించి సౌమ్య మొదటి స్థానంలో నిలవగా, ఎంపీసీలో 908 మార్కులతో మేఘన రెండవ స్థానం, బైపీసీలో 892 మార్కులతో దివ్యశ్రీ మూడవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.

కణేకల్లు మండలంలో..



అయేషా బైపీసీ,976

కణేకల్లు: మండలక్రేంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 226 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా 154 మంది పాసై 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 195 మందికి గాను 190 మంది పాసై 97.44 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్ బైపీసీలో అయేషా 976 మార్కులు సాధించింది. అలాగే మోడల్‌స్కూల్‌లో ఫస్ట్ ఇయర్‌లో 66 మందికి గాను 49 మంది పాసై 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకెండియర్‌లో 33 మందికిగాను 30 మంది పాసై 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో మొదటి సంవత్సరంలో 22 మందికిగాను 20 మంది పాసయ్యారు. సెకెండియర్‌లో 27 మందికి 26 మంది పాసయ్యారు. గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరంలో 50 మంది పరీక్షలు రాయగా వంద శాతం పాసయ్యారు. అలాగే సెకెండియర్‌లో 39 మందికి 39 మంది పాసై వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

విడపనకల్లు మండలంలో..



జీ.రాధిక 908 బీ.ఉమ 828 జే.మానస 821

విడపనకల్లు: మండలం లకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. మొదటి సంవత్సరంలో 29 మందికి గాను 23 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండోసంవత్సరంలో 28మందికి గాను 25 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో వివిధ గ్రూపులకు చెందిన జీ.రాధిక 908, బీ. ఉమా 828, జే.మానస 821 మార్కులు సాధించారు. అలాగే ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 34 మందికి గాను 12 మంది ఉత్తీర్ణత సాధించారు సెకెండ్ ఇయర్‌లో 21 మందికి గాను 13 మంది ఉత్తీర్ణత సాధించారు.


యాడికి మండలంలో..



లహరి ఎంపీసీ, 465

యాడికి: ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో మండల కేంద్రానికి లహరి ఎంపీసీ గ్రూప్‌లో 470కి 465 మార్కులు సాధించింది. స్థానిక లాలెప్పకాలనీకి చెందిన రాయుడు కుమార్తె లహరి కర్నూలు జిల్లా బనవాసి బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తోంది. మంచి ప్రతిభ కనబరిచి 465మార్కులు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చదువుతూ అత్యధిక మార్కులు సాధించడం అభినందించదగ్గ విషయమని తెలిపారు.

పుట్లూరు మండలంలో..



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

పుట్లూరు ఆదర్శపాఠశాల విద్యార్థులు ఇంటర్‌లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష 62మంది విద్యార్థులు రాయగా 50మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 35మంది రాయగా 29మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జనార్దన్ 456 మార్కులు, బైపీసీలో కల్యాణి 427 మార్కులు, ఎంఈసీలో సింధు 467మార్కులు, సీఈసీలో జ్యోత్స్న 449మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో గౌతమి 878 మార్కులు, వీరమానస 878మార్కులు, బైపీసీలో మహిత 967మార్కులు, సీఈసీలో జ్యోత్స్న 950మార్కులు సాధించడంతో ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం: కాలవ

● సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి గుర్తింపుకార్డుల పంపిణీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సభ్యత్వం నమోదు చేసుకున్న పార్టీ కార్యకర్తలకు పట్టణంలోని సీతారామాంజనేయ కల్యాణమంటపంలో శనివారం గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందుకు కాలవ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారని, అప్పటి పాలకులు అధికార మదంతో అనేక కేసులు పెట్టి వేధించారని, అన్నింటినీ తట్టుకుని నిలబడి పార్టీకి సేవ చేసిన ప్రతికార్యకర్తను తప్పక ఆదుకుంటామని అభయమిచ్చారు. అప్పట్లో వేధింపులకు పాల్పడిన వైసీపీ వారిని వదిలే ప్రసక్తే లేదని, అందరికీ చట్టప్రకారం శిక్షలుంటాయని తెలిపారు. నియోజకవర్గంలో 70 వేల మందితో సభ్యత్వం చేయాలని అధిష్టానం ఆదేశించగా.. అంతకుమించి చేశారని, 11 మంది శాశ్వతసభ్యులుగా చేరారని, ఇది ఎంతో గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. త్వరలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కమిటీల ఎంపిక జరగబోతోందని, నియోజకవర్గంలో 8792 మంది సాధికార సారథులు ఉండాలని అన్నారు. పార్టీ రూపొందించిన విధివిధానాల మేరకు సారథుల ఎంపిక త్వరగా చేపట్టి మూడురోజుల్లో పార్టీ కార్యాలయానికి పంపాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తర్వాత అందరికీ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.

సభ్యత్వ నమోదులో కణేకల్లు భేష్

కణేకల్లు: రాయదుర్గం పట్టణంలో చేపట్టిన కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీలో టీడీపీ సభ్యత్వ నమోదులో కణేకల్లు మండలం భేష్‌గా ఉందని కాలవ పేర్కొన్నారు. 17,500 మేర సభ్యత్వనమోదు చేసి నియోజకవర్గంలో మొదటిస్థానంలో ఈ మండలం నిలిచిందని చెప్పారు. మండల టీడీపీ నాయకులను అభినందించారు.

ఆంజనేయస్వామికి పూజలు

రాయదుర్గం పట్టణ సమీపంలోని కొండపై సింగప్పబావి వద్ద వెలసిన బ్రహ్మ వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నూతన ఆలయంలో వాల్మీకి సంక్షేమ సేవాసమితి నియోజకవర్గం అధ్యక్షుడు బండి కిష్టప్ప, సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు కలశ స్థాపన పూజలు, హోమాలు చేశారు. అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

● ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తాడిపత్రిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



ప్రత్యేక అలంకరణలో మురడి ఆంజనేయస్వామి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: హనుమజ్జయంతి వేడుకలను అన్ని ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ప్రాంతాల్లో ఆంజనేయ స్వామి రథోత్సవాలు చేశారు. అలాగే ఇంకొన్ని చోట్ల హిందుత్వవాదులు, వీహెచ్‌పీ నాయకులు శోభాయత్రలు, బైక్‌ర్యాలీలు నిర్వహించి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. తాడిపత్రి పట్టణంలో జరిగిన హిందూ ఐక్యతా బైక్ ర్యాలీలో ముఖ్యఅతిథిగా కర్నూలు జిల్లా ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధి పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

● నేలకొరిగిన 200 నిమ్మచెట్లు

● 80 ఎకరాల్లో పంట నష్టం



మధ్యగుడిసెలు గ్రామంలో నేలకొరిగిన నిమ్మచెట్లు

యాడికి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిసెలు గ్రామంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో 200దాకా నిమ్మచెట్లు నేలకొరిగాయి. 80ఎకరాల్లో నిమ్మపంట నేలరాలింది. పదుల సంఖ్యలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలుల బీభత్సానికి కోటి రూపాయలకు పైగా నిమ్మపంట నష్టపోయినట్లు రైతులు వాపోయారు. రామన్నగుడిసెలు, మధ్యగుడిసెలు గ్రామాల్లో నిమ్మపంట ఎక్కువగా సాగుచేశారు. పంట దిగుబడి వచ్చిన సమయంలో ఈదురుగాలి రూపంలో రైతులు పంటను తీవ్రంగా నష్టపోయారు. కేశవరెడ్డి అనేరైతు తోటలో 5సంవత్సరాల నిమ్మచెట్లు 40నేలకొరగాయి. అందులో నేలరాలిన నిమ్మకాయలు 200బస్తాలకు పైగా కావడం గమనార్హం. చెన్నారెడ్డి అనే రైతుకు చెందిన నిమ్మ తోటలో 40చెట్లు నేలకొరిగాయి. నారాయణరెడ్డి అనే రైతుకు చెందిన 30చెట్లు నేలకొరిగాయి. కృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రంగేశ్వరరెడ్డి, రవికుమార్‌రెడ్డిలకు చెందిన తోటల్లో పదుల సంఖ్యలో నిమ్మ చెట్లు నేలకొరిగాయి. తోటల్లోని దిగుబడికి వచ్చిన నిమ్మకాయలు, పిందెలు, పూతసైతం నేలరాలాయి. ఉద్యానశాఖ అధికారులు నష్టపోయిన నిమ్మతోటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు.

నేలకొరిగిన మొక్కజొన్న

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి సుమారు యాభై ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. రైతులు కే మధుకు చెందిన ఆరు ఎకరాలు, జీవరత్నంకు చెందిన ఐదు ఎకరాలు, నీలకంఠారెడ్డికి చెందిన మూడు ఎకరాలు, కస్తూరిరెడ్డికి చెందిన ఐదు ఎకరాలతో పాటు ఇతర రైతుల కు చెందిన తోటల్లో పంట నేలకొరిగింది. వారం రోజుల్లో పంట చేతికొస్తుందని ఆశతో వున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. పభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

పంట పొలాల పరిశీలన

విడపనకల్లు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాల పల్లి గ్రామంలో పలు పంట పొలాలను ఫారెస్టు అధికారి హెచ్ కరీముల్లా వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య శనివారం పరిశీలించారు. గత 8వ తేదీన మండల కేంద్రంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పెద్ద కొట్టాలపల్లి గ్రామ రైతులు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి జింకల బెడదతో పంటలు నష్ట పోతున్నామని, వాటి బెడద నుంచి పంటలను రక్షించాలని వినతిపత్రం అందించారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు అధికారులు పెద్ద కొట్టాల పల్లికి చేరుకుని పంటలను పరిశీలించారు. జింకల మంద నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. అసిస్టెంట్ బీట్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఏఈఓ రాఘవేంద్ర, వీఆర్వో రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

● కూడేరు: గత రెండ్రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని చోళసముద్రం, కడదరకుంట, మరుట్ల గ్రామాల్లో పెద్ద ఎత్తున అరటి, మామిడి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. ఆ పొలాలను ఆర్డీఓ కేశవనాయుడు, ఉద్యానవన ఇన్‌చార్జ్ పీడీ ఫిరోజ్‌ఖాన్, ఏపీఎంఐపి పీడీ రఘునాథ్ రెడ్డి, తహసీల్దారు మహబూబ్ బాషా, హెచ్ఓ నెట్టి కంఠయ్య పరిశీలించారు. మండల వ్యాప్తంగా 70 ఎకరాల్లో అరటి, 25 ఎకరాల్లో మామిడి, 7 ఎకరాల్లో బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయని, దాదా పు రూ. 90 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఉద్యానవన శాఖ అధికారులు నివేదిక పంపారు.

రక్తదాన శిబిరం

గుంతకల్లు, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే ఆసుపత్రిలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతోపాటు ఆయన సతీమణి పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం 84 మంది రైల్వే ఉద్యోగులు రక్తదానం చేశారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

పామిడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే రోగులు తమ పాత హెల్త్ రికార్డులతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారాంతపు సంత ప్రారంభం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన వారాంతపు సంతను శనివారం టీడీపీ నాయకుడు, నగర సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్ర సాగర్, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీధరఘట్టలో ప్రతి శనివారం సంత జరగనున్నట్లు చెప్పారు.

పిడుగుపాటుకు పశువుల మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి, కురవళ్లి, బొమ్మనహాళ్, ఏళంజి, కొత్తూరు గ్రామాలలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కురవళ్లి, కొత్తూరు గ్రామాలలో పిడుగులు పడ్డాయి. కొత్తూరులో రుద్రయ్యకు చెందిన ఆవు, ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందాయి. ఎద్దు విలువ రూ.80 వేలు, ఆవు రూ.40 వేలు ఉంటుందని బాధితుడు వాపోయారు.

జీతాలు చెల్లించాలంటూ ఆందోళన

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించాలని కోరుతూ.. పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక పంపుహౌస్ వద్ద అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సమ్మెకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మద్దతు పలికారు.

రాతిదూలం లాగుడు పోటీలు

తాడిపత్రి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఆలూరుకోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆలూరు గ్రామంలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. దాదాపు 18జతల వృషభరాజులు పోటీల్లో పాల్గొన్నాయి. వీటిలో పలు ప్రాంతాల నుంచి వచ్చినవృషభాలు ప్రతిభ చూపాయి. విజేతగా నిలిచిన వాటి యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

వైభవంగా మల్లేశ్వర స్వామి రథోత్సవం



ఉరవకొండలో మల్లేశ్వర స్వామిరథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మల్లేశ్వరస్వామి రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. రథాన్ని చాబాల రోడ్డు వరకూ లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలాగే మండలంలోని రాకెట్ల గ్రామంలో సుంకలమ్మదేవి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. తర్వాత అశేష భక్తజనం నడుమ రథోత్సవాన్ని నిర్వహించారు. ఇక వజ్రకరూరు మండలంలోని చాయాపురంలో సుంకలమ్మదేవి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుంకులమ్మదేవి, దేవమ్మదేవి రథోత్సవం

విడపనకల్లు: మండల కేంద్రంలో సుంకులమ్మదేవి, దేవమ్మదేవిల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయమే ఆలయాల్లో అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు రథంపై ఉంచి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక రంగస్వామి ఆలయం వరకూ రథాన్ని లాగారు. అనంతరం సుంకులమ్మ ఆలయం వద్దకు రథాన్ని చేర్చడంతో వేడుకలు ముగిశాయి.

చిక్కణ్ణేశ్వరస్వామి ఊరేగింపు

కణేకల్లు : మండల కేంద్రంలో చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధులలో ఊరేగించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక బండిలో అలంకరించి పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం చిక్కణ్ణేశ్వరదేవాలయం నుండి దిగువ గేరి ఆంజనేయస్వామి గుడి వరకు మేళతాళాలతో ఊరేగించారు. అలాగే సిద్ధప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని కూడా ఊరేగించారు.

జంభుకేశ్వరస్వామి రథోత్సవం

రాయదుర్గం: పట్టణంలోని జంభుకేశ్వరస్వామి రథోత్సవ వేడుక ఘనంగా సాగింది. ఆలయం వద్ద నుంచి కోట మీదుగా రథాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో శివనామస్మరణ చేస్తూ లాగారు. తొలుత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సంగమేశ్వరుడి కల్యాణం

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లి గ్రామ సమీపంలో పెద్ద, చిన్న వేదావతి హగరి నదులు సంగమం వద్దన ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంగమ్మ, సంగమేశ్వర ఉత్సవ విగ్రహాలను గ్రామం నుండి ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకువచ్చి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదావతి హగరి నుంచి గంగాజలం తెచ్చి అభిషేకం, అలంకరణలు చేశారు. తర్వాత వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. నేడు సాయంత్రం 5:30 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా మోడల్‌స్కూల్ ఫలితాలు



జీ.మేఘన, బైపీపీ,934 ఎస్.లక్ష్మీ ఎంపీసీ,902 కే.లాస్య ఎంపీసీ,452 ఎస్.సింధు, బైపీసీ,415 కే.భూమిక, సీఈసీ,417

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 66 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కే.లాస్య 452, బైపీసీలో ఎస్. సింధు 415, సీఈసీలో కే.భూమిక 417, ద్వితీయ సంవత్సరం బైపీసీలో జీ. మేఘన 934, ఎంపీసీలో ఎస్.లక్ష్మీ 902 మార్కులు సాధించి సత్తా చాటారు.

బ్రహ్మసముద్రం మండలంలో..



సెకెండియర్‌లో అధిక మార్కులు సాధించిన చందన, హైమావతి

బ్రహ్మసముద్రం: ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందరూ పాసై వందశాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సౌభాగ్య లక్ష్మీ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో యం. చందన సీఈసీలో 877 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. వై హేమావతి 868 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు.

కంబదూరు మండలంలో..



హారిక, ఫస్టియర్ అమృత యాదవ్, సెకెండియర్ మేఘన, సెకెండియర్

కంబదూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూవో (నర్సింగ్) మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో విద్యార్థినులు ప్రతిభ చూపి 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రూప తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 38 మందికి గాను 37 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో హారిక (485), పూజ (483) మార్కులు సాధించి పాఠశాల టాపర్లుగా నిలిచారన్నారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 36 మందికి గాను 35 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో మేఘన (895), అమృత యాదవ్ (887) మార్కులు సాధించినట్లు చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలల హవా..



ప్రతిభ చూపిన సాయి సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు శ్రీనిధి, హాసిని, షాహిదా, సానియా



సాఫియా సిద్ధిఖా సీవీరామన్ కళాశాల విద్యార్థినులు నిత్యశ్రీ, జీవన, కుల్‌సుంబీ, కీర్తి

తాడిపత్రి: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో శ్రీనిధి 470కి గాను 465మార్కులు, పి. సానియా 465, మోబిషిరా 465, ఉషశ్రీ 465, కైఫ్ 465 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో కె. హాసిని 440కి గాను 432మార్కులు సాధించింది. అయేషా ఫర్హానా 430, షాము 428మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో షాహిదా 500కు గాను 490 మార్కులు సాధించింది. తస్దిక్ 485 , నఫీషాబాను 482మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మెహక్ సుల్తానా 1000మార్కులకు గాను 992 మార్కులు సాధించింది. వాత్సల్య 988, పల్లవి 987, శ్రీచరణ్ 987, బైపీసీ విభాగంలో ఎం. సానియా 988, భువనేశ్వరి 984, జెబాఫాతిమా 982, సీఈసీ విభాగంలో సాఫియా సిద్ధిఖా 971, అంజు 957, ప్రసన్న 953 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

అలాగే సర్‌సీవీ రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారని విద్యాసంస్థల చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో నిత్యశ్రీ 470మార్కులకు గాను 466 సాధించింది. వేణు 464, వరుణ్ 463, పవిత్ర 463, మహదేవి 462 మార్కులు సాధించారన్నారు. బైసీపీ విభాగంలో జీవన 440మార్కులకు గాను 431 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో కులుసుంబీ 1000కిగాను 988మార్కులు, అర్చన 985, నవిత 981, వినోద్ 981మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో కీర్తి 1000కి 967 సాధించిందని ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కూడేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బసాపురం ఆంజనేయు స్వామి ఆలయం ఎదురుగా రెండు ద్విచక్రవానాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో తీవ్రగాయాలైన నాగార్జున (28) అనే యు వకుడు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన నాగార్జున తన పెద్దనాన్న నారాయణతో కలిసి బైక్‌లో కూడేరుకు బయలుదేరాడు. బసాపురం ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే ఎదురుగా మరో ద్విచక్రవాహనం వచ్చింది. ఈ క్రమంలో రెండు బైక్‌లు వేగంగా వెళ్తుండడంతో అదుపుతప్పి పరస్పరం ఢీకొన్నాయి. నాగార్జునకు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి కొండన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జిందాల్ ఉద్యోగి ..

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపాన గల నేషనల్ హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిందాల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన హరికృష్ణ మృతి చెందాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారిలో నివాసముండే హరికృష్ణ తన స్నేహితుడు అయిన నరేంద్రరెడ్డితో కలిసి శుక్రవారం మండల కేంద్రం సమీపంలో ఉన్న గవి సిద్ధేశ్వరస్వామి ఆలయానికి బైక్‌పై వచ్చాడు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా.. ఓబుళాపురం గ్రామ సమీపంలోని నేషనల్ హైవేపై అకస్మాత్తుగా కుక్క అడ్డువచ్చింది. దానిని అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హరికృష్ణ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య శ్రావణి, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

యాడికి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): బస్సు రివర్స్ చేస్తున్న సమయంలో చెట్టుకు తగలడంతో కొమ్మ విరిగిపడి రంగమ్మ అనే మహిళ, మద్యం మత్తులో కొడుకు దాడిలో వెంకటలక్ష్మి అనే వృద్ధురాలు తీవ్రగాయాలపాలైన సంఘటన శనివారం జరిగింది. మండలకేంద్రంలో రంగమ్మ అనే మహిళ బంధువులతో కలిసి నంద్యాల జిల్లా అవుకు మండలం కంబగిరి స్వామి తిరుణాలకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో చెట్టుకింద సేదతీరుతుండగా ఆర్టీసీ బస్సు రివర్స్ చేసుకొనే సమయంలో చెట్టుకు ఢీకొట్టింది. కొమ్మ విరిగి రంగమ్మపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. రంగమ్మను యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అలాగే ఓబులాపురం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి అనే వృద్ధురాలిపై మద్యం మత్తులో కుమారుడు దాడిచేయంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం యాడికికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం తాడిపత్రికి తరలించారు.